నడచెను. ఈ యుద్ధయాత్రలవల్ల నప్పటికే సత్వహీనమైయుండిన కేంద్రప్రభుత్వము మఱియుం దుర్బలస్థితికి వచ్చినది. మల్లికార్జున రాయల వధయును, నొడ్డెవారి సహాయముతో విరూపాక్ష రాయల రాజ్యసమాక్రమణమును సామ్రాజ్య విచ్ఛిత్తికి దోహదప్రాయమైనవి. నాయకులును దొరలును నామకార్థము రాయలయధికారము నంగీకరించుచు వచ్చినను, ఎవ్వరి కిష్టమువచ్చినట్లు వారు ప్రవర్తింపగడగిరి. దేశమున నిట్లరాజక స్థితులు ప్రబలియుండిన సమయమున సాళువ నరసింహరాజు తన యధికారమునకు దృఢమగు పునాదులను నిర్మించుకొనెను. విరూపాక్ష రాయలు సింహాసనము నధిష్ఠించునప్పటికె యతడు చిత్తూరారాకాటు ద్వయకోలారు మండలములపై దనయధికారమును నెలకొల్పెను. గొప్ప బలమును గూర్చుకొని రాయలకు బ్రతిద్వంద్వియై వర్ధిల్లెను. అతని మార్కొన జాలిన బలశాలి రాయసామ్రాజ్యమున లేడాయె; కావుననే యతడు విరూపాక్షుని ధిక్కరించి మల్లికార్జున రాయల పుత్రుడగు రాజశేఖరరాయలను జేరదీసి తనయాస్థానమున నాశ్రయ మొసగగల్గెను.

(సశేషము)

కథానిక

# ఆఘ్రాత పుష్పం

'జయంతి'

సరోజ పేదకుటుంబంలో పుట్టింది. పేదతనం ఉగ్గుపాలతో జీర్ణించు చేసుకుంది.

"సరూ ! మీ తండ్రిని నాశనం చేసి మనల్ని ఈ స్థితికి తీసుకు వచ్చిన దారిద్ర్యాన్ని మనం జయించాలి. అదే మన జీవిత లక్ష్యం. ఎంత త్యాగం చేసినాసరే మనం ధనికుల మవాలి" అని తల్లినేర్పిన చిన్ననాటి పాఠం ఆమెలో గాఢంగా నాటుకుపోయింది. చదువు చదివి, ఆ లక్ష్యాన్ని సాధించా లనుకుంది.

సరోజ అపూర్వ సుందరి. ఆమె నేత్ర గోళాలు ఎట్టి అంధకారంలో నైనా ధగ ధగ లాడుతాయి. చిరుముంగురులు ఎంత పిల్లగాలి కైనా రెపరెప లాడుతాయి. పలువరుసలు ఎంత చిన్నమాటకైనా తళతళ మెరుస్తాయి. ఇక భానుమూర్తి సంగతి చెప్పనే అక్కర లేదు. అతడు ప్రథముడుగా రాని పరీక్ష లేదు. చక్కని పద్యాలు రాస్తాడు. పాతకొత్తల మేలు కలయిక అతని కలానికి శ్రీరామరక్ష. కొత్త కవు లతన్ని కోవిదు డంటారు. పాత కవు లతన్ని 'భాయీ' అంటారు. అందుకే జగమెరిగిన రసజ్ఞు లంతా అతన్ని మెచ్చుకుంటారు. విద్యార్థి దశలోనే ఇంత పేరు సంపాదించుకున్న భానుమూర్తి ఒక నాడు మహాకవి కాగలిగే సూచన లున్నాయని జోస్యం చెబుతారు, తెలిసినవారూ తెలియని వారూ కూడాను.

అలాంటప్పుడు ఒకే తరగతిలో చదువు తూన్న సరోజ, భాను పరస్పరం సన్నిహితు లవడంలో అసహజ మేమిటి? సరోజా భాను మూర్తీ తరచు మాట్లాడుకుంటుండేవారు. అతడు ప్రతీ ఆదివారం ఆమె బసకు వెళ్ళి చూస్తుండే వాడు. ఇద్దరూ లోకపురీతులు, సమాజం నిర్మించిన చట్టాలు గురించి చర్చించుకునేవారు సరోజ మానవజీవితం సుఖవంతం కావడానికి ధనం అత్యవసర మనేది. భానుమూర్తి 'ధనం అవసరం కాని, అత్యవసరం కాదు' అని వాదించే వాడు. సరోజ తన భావాలనే నమ్ముకుని కించపడుతుండేది. కాలప్రవాహంలో రెండేళ్లు గడిచాయి. పరీక్ష లయిపోయాక ఎవరి యిండ్లకు వాళ్లు పోతున్నారు. భానుమూర్తి సరోజను రైలెక్కించాడు. ఆమెకళ్లలోకి దీర్ఘంగా చూస్తున్నాడు. మూర్తీభవించిన సౌందర్య దేవతలా ఆమె వెలుగుతూంది.

"సరోజా- ఎప్పుడు మన కలయిక ?" అన్నాడు, అప్రయత్నంగా.

"ఆ భావం నాకు తెలియలేదు," అంది సరోజ.

"శాశ్వతమైన కలయిక; ఎన్నడూ విడివడక కాలపుటంచులకి తేలిపోయే ఐక్య జీవితం..."

"భానూ! క్షమించు. నా వివాహం నిశ్చయమైపోయింది. ఒక ధనికునితో, ఈ నెలలోనే. మా అమ్మ నిశ్చయం చేసింది."

భానుమూర్తిమీద పిడుగుపడినట్లయింది. ప్రపంచంలోని అమంగళాల బృందగానం తన ముందు మ్రోగినట్లయింది. సరోజకుకూడా పెద్ద యేడుపు వచ్చింది. ఏదో చెబుదామనుకుంది, కాని గొంతు మ్రోగలేదు. ఒక ఉత్తరంమాత్రం తీసి ఇచ్చింది. నిర్ఘాంతపోతూ అలాగే చదువుతున్నాడు.

"సరూ! నీ వివాహం రాజారావుతో నిశ్చయించాను. అతనికీ, భానుమూర్తికీ ఆర్థిక స్థితిగతులలో ఉన్న తేడా నీకు తెలుసునుగదా! భానుమూర్తినుండి నిన్ను దూరంచేస్తున్నందుకు విచారిస్తున్నాను కాని, అది నీమంచికోసమే తల్లీ!"

సరోజ మళ్లీ ఉత్తరం అందుకుంది. "బాబూ! రైలు కదులుతోంది. వెనక్కి వుండండి" అన్నాడొక పోర్టరు భానుమూర్తితో. ఇంతలో బండి కదిలింది. సరోజ వెర్రిగా చూసింది.

"భానూ! తప్పక వస్తావుగదూ నా పెళ్లికి" అనిమాత్రం అనగలిగింది.

"అలాగేలే, బ్రతికివుంటే" అన్నాడతడు. రైలు వెళ్లిన రెండు నిమిషాలదాకా భానుమూర్తి రుమాలు వూపుతూనే వున్నాడు ఎవరికో—ఎందుకో.

సరోజకూ రాజారావుకూ పెళ్లి జరిగింది. భానుమూర్తి మాత్రం తరలిరాలేదు. రాజారావు శ్రీమంతులపుత్రుడు. వ్యాపారంలో వేలాది ఆర్జించనూగలడు; పందేలలో అంతకుమించి ఓడిపోనూగలడు. బిచ్చగాండ్రకు కానీ యివ్వకుండా పోగుచెయ్యనూగలడు; రత్నాలు క్రిందగే రంగేళీ మిత్రులను పోషించనూగలడు. లోకపు దృష్టిలో అతడు అదృష్టవంతుడు. సరోజలో ఎట్టిమార్పూ రాలేదు. రాజారావుని అర్థంచేసుకుందుకు అహోరాత్రాలు ఆమె కృషి చేసింది. అతనిలోని దుష్టబుద్ధుల్ని నిర్మూలించడానికి ప్రయత్నించింది. కాని రానురాను ఆ ప్రయత్నాలు ఫలరూపం తాల్చలేదు. రాజారావు సరోజను చూచి మొదట్లో మురిసిపోయేవాడు. నలుగురూ ఆమెసౌందర్యాన్ని కొనియాడుతూంటే మైమరచేవాడు. అతని ప్రేమ వ్యామోహ రూపంగానే వుండిపోయింది. ఆమెతో మాత్రం ఎన్నడూ అంతరంగిక విషయాలు ముచ్చటించలేదు. ఆ ప్రస్తావన ఎన్నడూ ఆమె చెయ్యడాన్ని సహించనూ లేదు. రెండేళ్లు గడిచాక రంగులు మారేయి. సరోజమీద వ్యామోహం చల్లారినకొద్దీ ఆమెను కేవలం క్రీడావస్తువుగా చూసి ఇతర సమయాలలో ఆమె ప్రసక్తి అంటేనే విముఖత్వం చూపేవాడు. సరోజకు అదినుండీ రాజారావుమీద మనస్సు లగ్నం కాలేదు. ఆమె నడవడిక సామాన్యమైనదే. అది వైవాహిక స్త్రీకి సమాజం రాసిపెట్టిన ధర్మంమాత్రమే. ఇన్నాళ్లూ ఓర్పో, ఓర్పుతో ఆ ధర్మాన్ని పాటిస్తూవచ్చింది సరోజ. కాని, అది రానురాను దుర్భరమయింది. అతడు తనను భార్యగా చూడకపోవడంవల్ల ఆమెలో విరక్తి జనించింది. పైగా అతడు ఇంకో ఇద్దరు స్త్రీలతో రహస్య ప్రణయం నడుపుతున్నట్లు చూచాయగా తెలియవచ్చింది. అట్టివానితో తన కలయిక కేవలం వ్యభిచారం గాక మరేమిటని తనలో తాను దిగులు పొందింది. ఆఖరిసారిగా అతని శీలాన్నిగురించి మాట్లాడుతూ మందలింప చూసింది. కాని అది నిష్ఫలం. రాజారావు ఉగ్రుడై "ఇక నీకూ నాకూ సంబంధం లేదు" అని ఇంటినుండి వెళ్ళగొట్టేడు. ఆమె ఏమాత్రం చలించలేదు.

స్వస్థలానికి తిరిగివచ్చి సరోజ మళ్ళీ చదువు ప్రారంభించింది. దివారాత్రాలు నిద్రాహారాలు మరచి విద్యాదీక్షను స్వీకరించింది. తన సర్వస్వాన్నీ ధారపోసి యం. బి. బి. యస్! పూర్తిచేసుకుంది. ఇన్నాళ్లూ ఆమె రాజారావును

గురించి తలపోయాకూ లేదు; భానుమూర్తిని మరచిపోనూ లేదు. భానుమూర్తిని గురించిన చింతన ఛాయలా ఆమెను వెన్నంటేది. సాయంత్రం ఎట్టి ఏకాంతప్రదేశంలో కూర్చున్నా, అతని మాటలు ఆమెను కలవరపెట్టేవి. అతన్నిగురించి ఎందరినో అడిగింది. కాని, ఎవ్వరూ సరిగా చెప్పలేక పోయారు. ఒక స్నేహితుడు మాత్రం ఇలా అన్నాడు, "అతనికి పిచ్చిఎత్తినట్లు చూచాయగా తెలిసింది" అని. ఒక స్నేహితురాలు రాసింది: "భానుమూర్తి మనోవ్యాధితో కాలధర్మం పొందినట్లు ఎవరో అన్నారు" అని. అంతే. మళ్ళీ ఎవర్నీ అడగలేదు సరోజ ఆ విషయం, అలాంటి మాటలు వినదలుచుకోనూ లేదు. కాని, ఏ జనసమూహాన్ని చూసినా ఏదో పోగొట్టుకున్నట్లు ఆమె కళ్లు వెదుకుతూంటాయి. ఏపద్యాలు చదివినా కవిపేరు తెలిసేదాకా ఒకే తహతహ.

చదువు పూర్తిచేసుకుని సరోజ వైద్యశాల పెట్టుకుంది. అచిరకాలంలోనే ఆమె ఖ్యాతి ఘుమఘుమ లాడింది. ఒక ఆపరేషనుకు మెచ్చుకుని జమీందారు కారు కొనియిచ్చాడు. రెండు సంవత్సరాలలోనే దివ్యభవనం తయారయింది. ఏమూలచూసినా ఆమెపేరు పేదసాదలలో మ్రోగిపోయింది. శ్రీమంతులెందరో ఆమె క్రీగంటి చూపుకై కలలు కనేవారు ఆమె ముందు మోకరిల్లి సర్వం అర్పణ చెయ్యడానికి సిద్ధపడేవారు. ఆమె యౌవనపు ఉద్రేకాలను వైద్యసేవలో మరచిపోయేది. చిత్త చాంచల్యం కలగబోయే కొన్ని బలహీనపు ఘడియల్లో భానుమూర్తి జ్ఞాపకంవచ్చి "నీమనస్సు నాది సుమా!" అనేవాడు. సమాజంలో ఆమెకు లభించిన ఉన్నతస్థానం ఎంతమాత్రం భానుమూర్తిని ఆమె స్మృతిపథాలనుండి దూరం చేయలేకపోయింది. అయినా, సమాజం ఆమె శీలాన్ని శంకించింది. ఆమెపైన ఎన్నో కల్పనాకథలు అల్లబడి ప్రచారాన్ని పొందేయి. ఇవికూడా ఆమె నేమాత్రం నిరుత్సాహ పరచలేదు. "ఈర్ష్యాళువు లేకాలంలో లేరు?" అని ఆమె సమాధానం చెప్పుకునేది. రాగారాగా ఆమెలో కలిగిన విచారం ఒకటే. "నాకు వివాహమనేదే జరిగి వుండకపోతే ఎంత బాగుండేది!"అనుకునేది అస్తమానం.

రోజూ కూర్చున్నట్లే సరోజ ఆవేళ సాయంత్రం దేవాలయం ఎదుట ఒంటరిగా కూర్చుంది. విజయదశమి కనక వేలాదిజనులు లోపలికి వెడుతున్నారు దేవీదర్శనానికి. తోసుకు వస్తూన్న కెరటాలలాగ ఎందరెందరో బయటకు వస్తున్నారు. స్త్రీలు నేత్రోత్సవంగా ధూపదీపాలు తీసుకు వెడుతున్నారు. సరోజ పక్కవాటుగా జనసందోహాన్ని చూస్తోంది. దూరాన వెలిగే విద్యుత్కాంతులు ఆమె కళ్ళలో ధగధగా మెరుస్తున్నాయి. ఆమె మెడలోని ముత్యాలహారం వెర్రిగా నవ్వుతూంది-తన విలువనెవ్వరూ అక్కడ పాటించలేదన్నట్లు. సిగలో ముడిచిన గులాబీలు స్వేచ్ఛని కోల్పోయినట్లు వ్యథపడుతున్నాయి. ఆమె కట్టుకున్న పసుపు రంగు పట్టుచీర ఆమె శరీరకాంతితో లీనమై తన ప్రత్యేకతని కోల్పోయినందుకు కించ పడుతోంది.

గుడిలో మ్రోగే గంటలశబ్దం ఆమెగుండెల్లో ప్రతిధ్వనిస్తోంటే ఆమె దీర్ఘంగా ఆలోచిస్తోంది. రెప్పవెయ్యని ఆ దృష్టిలో జీవితరంగాలు తిరుగుతున్నాయి. ధనపిపాస యొక్క నినాదం, ధనగర్వ విలాసం, నిష్కలంక ప్రేమ యొక్క నిర్వికార ప్రవృత్తి, లోకమర్యాదలలోని ఆడంబరత, మానసిక శాంతియొక్క మహోన్నత స్థానం—ఇవే ఆ శూన్యంలో తిరుగుతూన్న రంగులు. ఈ ఆలోచనలలో సరోజ శరీరాన్ని మరచిపోయింది తనచుట్టూ విస్తారిన నిస్సహాయత, నిస్పృహ కూడా ఆమె పొందే ఏకాగ్రతను, భంగపరచలేక పోయాయి. ఆ క్షణంలో ఆమె ప్రకృతిలోని తన అణురూపాన్ని గుర్తించుకుని సుఖదుఃఖాల కతీతమైన శాంతి పొందుతూంది. ఇంతలో చిన్ననాటి స్నేహితురాలు రాధ భర్తతో దూరాన పోతూ, భర్తను అక్కడ ఆపి సరోజను సమీపించింది.

"ఏమిటె సరోజమ్మా! అలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావు" అంది.

"ఏముంది రాధా! 'అఘ్రాత పుష్పాలు దేవతార్చనకి అర్హాలు కావు' అన్న చిన్ననాటి పాఠాన్ని పునశ్చరణ చేసుకుంటున్నాను" అంది సరోజ పరధ్యానంగా.